ఆకలితో ఆరు వారాలు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 27:

జగన్ ప్రభుత్వం ఉపాధి కూలీలతో పనులు చేయించింది. కానీ వేతనాలు ఇవ్వడం లేదు. సరిగ్గా ఆరు వారాలైంది. నిత్యం పని చేసి, కూలి డబ్బులు తీసుకుంటేగాని కడుపు నింపుకోలేని ఉపాధి కూలీలు ఆకలితో అలమటిస్తున్నారు. కానీ ఈ రాష్ట్రాన్ని ఏలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి జనం బాధలు పట్టవనే విమర్శలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఎర్రటి ఎండల్లో పనులు చేస్తున్న పేదలకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన కూలి పట్ల ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యమనే నిరసనలు పెల్లుబుకుతున్నాయి.

వైఎస్ జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు రాష్ట్రంలో ఒక్కరు కూడా కన్నీరు పెట్టకుండా చర్యలు తీసుకుంటానని వాగ్దానం చేశారు. ప్రస్తుతం ఉపాధి కూలీలకు జిల్లాలో ఆరు వారాలుగా కూలి డబ్బులు ఇవ్వడం లేదు. వాళ్లు ఆకలితో అలమటిస్తున్నారు. జగన్ రెడ్డి మాటకు.. చేతలకు పొంతన ఉండదనడానికి ఇది తాజా ఉదాహరణ. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దాదాపు 60 వేల మంది రైతులు, రైతు కూలీలు పనులు చేస్తున్నారు. వీరికి గత ఆరు నెలలుగా కూలీ డబ్బులు అందక పస్తులతో కాపురాలు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో రూ.10 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.5 కోట్ల దాకా కూలీ బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. మరో పది రోజుల్లో ఉగాది పండుగ వస్తోంది. కుటుంబ సభ్యులకు కొత్త బట్టలైనా కొనడానికి చేతిలో డబ్బులు లేవని, పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సిందేనని కూలీలు ఆందోళన చెందుతున్నారు. గతంలో కూడా 2 నెలల పాటు కూలి డబ్బులు రాక తీవ్రంగా ఇబ్బందులు పడ్డామని, ఎంతో ఒత్తిడి తెస్తే తప్ప.. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయలేదని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వివిధ కారణాల వల్ల సకాలంలో ఉపాధి హామీ పథకం నిధులు విడుదల చేయలేని పరిస్థితులు నెలకొన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే నిధులను సమకూర్చుకుని కూలీలకు వేతనాలు ఇవ్వాలి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ పరిస్థితి లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం సకాలంలో నిధులు విడుదల చేయకున్నా కూలీలను ఇబ్బందులకు గురి చేయకూడదనే ఉద్దేశంతో ప్రతి

- ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో రూ.15 కోట్ల బకాయిలు
- పట్టించుకోని జగన్



వారం ఆఖరుకు డబ్బులు అందించేవారు. అదే విదంగా గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున పనిదినాలను కల్పించేవారు. గత టీడీపీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లక్ష్యాన్ని సాధించినందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో అవార్డులు ఇచ్చింది.

● జాబ్ కార్డులు ఘనం.. పనులు చేసే వారి సంఖ్య మాత్రం నామమాత్రమే:

గత టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో వ్యవసాయ సీజన్ పూర్తయినా వేసవి సీజన్‌లో రైతులు, రైతు కూలీలు వలస వెళ్లకుండా పని దినాలను కల్పించింది. వైసీపీ ప్రభుత్వం మాత్రం ఉపాధి హామీ కార్యక్రమాన్ని లక్ష్యం మేరకు పూర్తి చేసేందుకు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి. వారాల తరబడి కూలీ డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు సకాలంలో ఉపాధి పనులు చేపట్టకపోవడంతో ఈ పనులపై ఆశలు వదులుకున్న రైతులు, రైతు కూలీలు పెద్ద ఎత్తున వలసబాట పడుతున్నారు. ఈ పథకం ద్వారా పక్క రాష్ట్రాల్లో ప్రభుత్వం ఇచ్చిన జాబ్‌కార్డులకు మించి రైతులు, కూలీలు ఉపాధి పనులకు పరుగులు తీస్తున్నారు. ఏపీ రాష్ట్రంలో మాత్రం జాబ్‌కార్డులు ఇచ్చిన మొత్తంలో కనీసం సగం మంది కూడా పనికి రాకపోవడం దారుణం. కర్నూలు జిల్లాలో మూడున్నర లక్షల మంది కుటుంబాలకు జాబ్‌కార్డులు పంపిణీ చేశారు. అయితే.. ప్రస్తుతం పనులు చేస్తున్న వారి సంఖ్య మాత్రం 35వేల మంది మాత్రమే. అదే విధంగా నంద్యాల జిల్లాలో రెండున్నర లక్షల మందికి జాబ్‌కార్డులు ఇచ్చారు. పనులు చేస్తున్న వారు మాత్రం 25 వేల మందికి మించి రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చే నిధులతో సంబంధం లేకుండా వెంటవెంటనే కూలీ డబ్బులు అందజేస్తే ఈ దారుణ పరిస్థితి ఉండేది కాదు. మరోవైపు రైతులు, కూలీలు వెంటవెంటనే పనులు చేసుకునే అవకాశాన్ని కల్పించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనులను గుర్తించి వాటికి అనుమతులు సాధించి రైతులు, కూలీలు పనులు చేసేలా అవగాహన కల్పించమని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇవ్వడం లేదనే చెప్పాలి.

● సిబ్బందికీ వేతన కష్టాలు:

ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో కీలకపాత్ర పోషిస్తున్న సిబ్బందికి గత మూడు నెలలుగా వేతనాలను అందించకపోవడంతో వారు లక్ష్యాలను చేరుకునే విషయంలో సరైన శ్రద్ధ చూపడం లేదు. రైతులు, కూలీలు చేసిన పనులకు కూలీ డబ్బులు అందక ఏ విధంగా పస్తులుంటున్నారో అదే విధంగా సిబ్బంది కూడా వేతనాల్లేక అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఉపాధి హామీ కూలీలకు గతంలో వేసవి భత్యం కింద అదనంగా కొంత మొత్తాన్ని కూలీలకు చెల్లించేవారు. గత ఏడాది నుంచి ఈ విధానానికి స్వస్తి పలికారు. వాస్తవంగా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఈ వేసవి భత్యాన్ని కూలీలకు అందించాల్సి ఉంది. ఈ భత్యాన్ని రోజువారి కూలీతో పాటు గతంలో చెల్లించేవారు. ఇలా రోజు వారి కూలీకి అదనంగా ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం లభించడంతో కూలీలు ఎంతో ఉత్సాహంగా పనులు చేసేవారు.

● త్వరలో చెల్లిస్తాం

ఉపాధి కూలీలకు డబ్బులు దాదాపు 6 నెలలవి ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నిధులను విడుదల చేసిన వెంటనే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వేసవి భత్యం గతంలో కేంద్ర ప్రభుత్వం చెల్లించేది. ప్రస్తుతం ఇవ్వడం లేదు.

- అమర్నాథ్ రెడ్డి, డ్వామా పీడీ

కోడ్‌పై 24 గంటల పర్యవేక్షణ

● ఎంఈసీ జిల్లా నోడల్ అధికారి జి.నాసరరెడ్డి



కర్నూలు(న్యూసిటీ), మార్చి 27: సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కేంద్రం 24 గంటలు పర్యవేక్షిస్తుందని ఎన్నికల నియమావళి ప్రవర్తన జిల్లా నోడల్ అధికారి, జడ్పీ సీఈఓ జి. నాసరెడ్డి తెలిపారు. బుధవారం జడ్పీలోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి జడ్పీలోని మినీ సమావేశంలో భవనంలో ఎన్నికల నియమావళి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నేటి వరకు దినపత్రికలలో వచ్చిన 42 ప్రతికూల వార్తలను సంబంధిత మండల ప్రవర్తనా నియామావళి టీంలకు పంపించామని తెలిపారు. పబ్లిక్ ప్రదేశాలలో అనధికారికంగా ఏర్పాటు చేసి 16,020 గోడ రాతలు, పోస్టర్లు తొలగించారని అన్నారు. ప్రైవేట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 42 పోస్టర్లను కూడా తొలగించారన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన 17 మంది వలంటీర్లు, ఒక డీఆర్‌డీఏ ఐకేపీ, కేఎంసీ డ్రైవరు-1, సహకార బ్యాంకు అంటెండరు-1ని ఉద్యోగం నుంచి తొలగించామని అన్నారు. భారత ఎన్నికల సంఘం ఏర్పాటు చేసి సీ విజిల్ యాప్ ద్వారా నేటి వరకు 89 ఫిర్యాదులు రాగా సహేతుకమైన 61పై విచారించి చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిగిలిన వాటిని 100 నిమిషాలలో అధికారులు పరిష్కరిస్తారని అన్నారు.

వైభవంగా లక్ష్మీ మాధవుడి కల్యాణం

గరుడ వాహనంపై స్వామివారి విహారం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోడుమూరు(రూరల్), మార్చి 27: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేకువజామున స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గోరంట్ల, ఎర్రగుడి గ్రామప్రజలు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు.కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య తోడ్కొని వచ్చారు. వేదపండితుడు వందవాసి రాధాక్రిష్ణ అధ్వర్యంలో మంత్రాలు పఠిస్తూ లక్ష్మీ మాధవుల కల్యాణం జరిపించారు. ఆలయం భక్తుల గోవింద నామస్మరణతో మారుమోగింది. ముడుమల గుర్తికి చెందిన కరణం లక్ష్మీనారాయణ, సావిత్రమ్మ దంపతులు అమ్మవారికి మంగళసూత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గుర్రెడ్డి సిబ్బంది మురళి, మాధవనాయుడు పాల్గొన్నారు.

● లక్ష్మీ మాధవస్వామి కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులకు గరుడవాహన సేవ చేశారు. టీడీపీ యువనేత కోట్ల రాఘవేంద్రారెడ్డి టెంకాయ కొట్టి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తిరుమలనాయుడు, దుబ్బన్న, పరమేశ్వరనాయుడు, ఎర్రగుడి వర్ధన్‌రెడ్డి, రాంబాబురెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా బ్రహ్మాజి

● ఏకగ్రీవంగా ఎన్నుకున్న వైద్యులు



కర్నూలు(హాస్పిటల్), మార్చి 27: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) కర్నూలు మెడికల్ కాలేజీ యూనిట్ అధ్యక్షునిగా ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజి మాస్టర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఏపీజీడీఏ జనరల్ బాడీ సమావేశం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఓల్డ్ సీఎల్‌జీలో వాడివేడిగా జరిగింది. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరపాలని కొందరు, వైద్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని మరికొందరు వైద్యుల మధ్య వాదన జరిగింది. చివరకు ఏపీజీడీఏ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డా.విజయానందబాబు అధ్యక్షుడిగా బ్రహ్మాజి పేరును ప్రతిపాదించగా.. సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దీంతో ఏపీజీడీఏ కేఎంసీ యూనిట్ అధ్యక్షుడిగా డా.బ్రహ్మాజి మాస్టర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం సెక్రటరీ విజయ మోహన్ రెడ్డి, కోశాధికారి డమం శ్రీనివాసులు, జనరల్ కౌన్సిల్ సభ్యులు సోమప్ప, మాధవి శ్యామల, ఉపాధ్యక్షులు జయరాం, ఎం.మల్లికార్జున, ఎగ్జిక్యూటివ్ సభ్యులు వెంకటరమణ, వైకేసీ రంగయ్య, మురళీ ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.

తమ్ముడి మృతి

బాధను దిగమింగి పరీక్షలు రాసిన సోదరీమణులు



కిషోర్ కుమార్ (ఫైల్)



తమ్ముడు మృతితో దుఃఖంతో పరీక్షలు రాసి వచ్చిన విద్యార్థినులు

మంత్రాలయం, మార్చి 27: తమ్ముడు మృతి చెందిన బాధలోనూ పదో తరగతి పరీక్షలు రాశారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన వగరూరు అరుణ్, సువర్ణలమ్మ దంపతుల కుమారుడు కిషోర్ కుమార్ (14) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఆయాసంతో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. కిషోర్‌కుమార్ సోదరీమణులు మమత, అక్షర ఆ బాధను దిగమింగుకొని బుధవారం పదో పరీక్షలు రాశారు. అనంతరం తమ్ముని అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

ఎమ్మిగనూరురూరల్, మార్చి 27: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి ఫారం దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సందీప్(12)అనే బాలుడు మృతి చెందాడు. ఆదోని వైపు నుంచి వస్తున్న బొలేరో వాహనాన్ని, ఎమ్మిగనూరు వైపు నుంచి వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరోలో ప్రయాణిస్తున్న సందీప్ మృతి చెందగా, ఈశ్వర్ అనే వ్యక్తితోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. ఆదోని పట్టణానికి చెందిన వారు పెళ్లి సంబంధం చూసేందుకు ఎమ్మిగనూరు మండలం కే తిమ్మాపురానికి బొలేరో వాహనంలో బయలు దేరారు. అలాగే కర్ణాటకకు చెందిన వారు మంత్రాలయం నుంచి ఆదోని వైపు కారులో ప్రయాణిస్తున్నారు. బనవాసి ఫారం దగ్గర బొలేరోను కారు ఢీకొట్టింది. క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా : టంగుటూరు వాసి మృతి

బనగానపల్లె, మార్చి 27: బనగానపల్లె మండలంలోని కైప అప్పలాపురం మార్గమధ్యలో ఆటో బోల్తాపడి టంగుటూరుకు చెందిన మాల బాల చౌడయ్య(60) అనే వ్యక్తి మృతి చెందినట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు బుధవారం తెలిపారు. బనగానపల్లె నుంచి టంగుటూరుకు బాలచౌడయ్య వెళ్తుండగా ఆటోలో వెళ్తుండగా బోల్తా పడి బాలచౌడయ్య మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని బనగానపల్లె వైద్యశాలకు తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య

బనగానపల్లె, మార్చి 27: బనగానపల్లె పట్టణ శివారులోగల బ్రహ్మంగారి మఠం సమీపంలోని శ్మశాన వాటిక వద్ద 55 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తిని పట్టణంలోని తెలుగుపేటకు చెందిన రాజేశ్ అనే వ్యక్తి హత్య చేసిననట్లు బనగానపల్లె పోలీసులు బుధవారం తెలిపారు. పట్టణ శివారులోని బహిర్భూమికి వెళ్లిన ఇరువురు ఒకరికొకరు ఘర్షణ పడడంతో రాజేశ్ గుర్తు తెలియని వ్యక్తిపై బండరాయితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె వైద్య శాలకు తరలించి రాజేశ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు బ్రహ్మంగారి మఠం వద్ద ఉన్న భోజన శాలలో భోజనం చేసి మఠం వద్దనే నివాసం ఉండేవాడని పోలీసులు తెలిపారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.2.30 కోట్లు

మంత్రాలయం, మార్చి 27: రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.2,30,26,480 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, శ్రీపతి ఆచార్ తెలిపారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆదేశాల మేరకు బుధవారం ఫిబ్రవరి 2 రోజులతో పాటు మార్చి 27 రోజులకు సంబంధించిన 29 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య లెక్కించినట్లు తెలిపారు. రూ.2,30,26,480 నగదుతో పాటు 848 గ్రాముల వెండి, 81 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈ హుండీ లెక్కింపులో సూపరింటెండెంట్ అనంత పురాణిక్, జేపీ స్వామి, నరసింహ దేశాయి, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, వాణి, గురురాజ్ పాల్గొన్నారు.

మహిళా జైలు తనిఖీ

కర్నూలు(లీగల్), మార్చి 27: మహిళా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. అక్కడుంటున్న మహిళా ఖైదీలకు అందిస్తున్న సదుపాయాల గురించి ఆయన జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళా ఖైదీలనుద్దేశించి మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం అవసరమైన మహిళా ఖైదీలకు తమను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఆ తర్వాత జైలులో ఖైదీల గదులను, వంటశాలను, రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఈయనతో పాటు ప్యానల్ న్యాయవాది బద్దెల లక్ష్మి నారాయణ ఉన్నారు.

నేటి నుంచి లా సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు(అర్బన్), మార్చి 27: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ పరీక్షలు ఈనెల 28 నుంచి ఏప్రిల్ 22 వరకు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. 2,4,6,8,10 సెమిస్టర్లకు సంబంధించి కర్నూలు ఉస్మానియా కళాశాలలో 646 మంది విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన డోన్ మార్కెట్ యార్డు చైర్మన్



మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి

డోన్, మార్చి 27: డోన్ నియోజకవర్గంలో అధికార వైసీపీకి భారీ షాక్ తగిలింది. డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణ మూర్తి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బుధవారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కోట్ల రాఘవేంద్రరెడ్డి సమక్షంలో టీడీపీలో తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు మరో 250 మంది వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మొదటి నుంచి మంత్రి బుగ్గన వెంట నడిచిన రాజా నారాయణమూర్తి సోదరులు టీడీపీలో చేరడంతో అధికార పార్టీకి భారీ షాక్ తగిలినట్టయింది. కోట్ల కుటుంబం మీద ఉన్న అభిమానంతో చంద్రబాబు నాయకత్వం రావాలన్న ఉద్దేశంతో టీడీపీలో చేరినట్లు రాజా నారాయణమూర్తి తెలిపారు. ఇదివరకే అంకిరెడ్డి వైసీపీని వీడడం, మరో వైసీపీ నేత ఇప్పుడు టీడీపీలో చేరడంతో ప్యాపిలిలో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ అధికార మదంతో మంత్రి బుగ్గన కోట్ల కుటుంబాన్ని అవహేళనగా మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారన్నారు. డోన్ నియోజకవర్గంలో బుగ్గన తన వ్యాపారాలు, సొంత జేబులు నింపుకోవడానికి అభివృద్ధి పనులు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ బుగ్గన ప్రసన్నలక్ష్మి, ప్యాపిలి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, డోన్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, జనసేన, బీజేపీ ఆలా మోహన్ రెడ్డి, వడ్డె మహారాజ్, దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

ముగ్గురు సైబర్ నేరస్తుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కర్నూలు, మార్చి 27: ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా అధిక ఆదాయం సంపాదించవచ్చని ఆశ చూపి పలువురిని మోసం చేసిన కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో ప్రధాన నిందితుడు నవీన్ కుమార్‌ను అరెస్టు చేసి అతనితోపాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐడీ అధికారులు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మునగాలపాడుకు చెందిన నవీన్ కుమార్‌పై 143 ఆన్‌లైన్ ఫిర్యాదులు ఉన్నాయని పోలీసులు గుర్తించారు. నవీన్ కుమార్ తనకు తెలిసిన వారిని పరిచయం చేసుకుని ఎస్‌ఏ ట్రేడింగ్ కంపెనీలో కొంత నగదు పెట్టుబడి పెడితే.. నెల రోజులకు కొంత నగదు తిరిగి వస్తుందని నమ్మించేవాడు. ఆ తర్వాత కొంత మందిని చేర్పిస్తే.. అందులో కూడా కమీషన్ల రూపంలో కొంత ఆదాయం వస్తుందని చెప్పేవాడు. బెంగళూరు కేంద్రంగా ఈ ఎస్‌ఏ ట్రేడింగ్ కంపెనీ ఉందని, దీనికి మేనేజింగ్ డైరెక్టర్ రమణ నాగ్ ఉన్నారని, ఆన్‌లైన్ ద్వారా ఒక లింక్ పంపిస్తే.. ఆ లింక్ ద్వారా అకౌంటు ఓపెన్ అవుతుందని, అందులో కొంత మొత్తం జమ చేయాలని తమకు తెలిసిన వారందరికీ సంబంధిత లింకులను పంపాడు. ఇలా జంగం వీరలక్ష్మి అనే యువతికి కూడా లింక్ పంపాడు. ఆమె ఆ లింక్ ద్వారా ఆమె ద్వారా దఫాలుగా రూ.4.87 లక్షలు పెట్టుబడి పెట్టించాడు. బాధితురాల నుంచి ఆ మొత్తం జమ చేసిన తర్వాత సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో నవీన్‌ను ఆమె నిలదీసింది. ఈ విషయంపై నవీన్ పలుసార్లు మాయమాటలు చెబుతూనే వచ్చాడు. చివరకు తాను మోసపోయానని గుర్తించిన ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు. సీఐడీ డీఎస్పీ దైవ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ నగేష్‌బాబు, ఎస్ఐ బండే సాహెబ్ ఆధ్వర్యంలోని ఓ టీమ్ కేసును ఛేదించారు. నిందతులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

వాట్సాప్ ప్రచారాలకు అడ్డుకట్ట

- అడ్మిన్లుగా ఉన్న వైసీపీ నాయకుల తొలగింపు
- ఎన్నికల నిబంధనలు పాటించాలని హెచ్చరికలు



ఆత్మకూరు, మార్చి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో జరుగుతున్న ఎన్నికల ప్రచారాలకు ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. వాస్తవానికి ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా సచివాలయ, వలంటీర్లు, మున్సిపాలిటీ ఇతర శాఖలకు సంబంధించిన అధికారిక గ్రూపుల్లో వైసీపీ నాయకులకు స్థానం కల్పించి అడ్మిన్లుగా నియమించారు. అంతేకాదు కొందరు వైసీపీ నాయకులే అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో ఆయా శాఖల అధికారులు ఆదేశాలు జారీ చేసేవారు. అంతటితో ఆగకుండా వైసీపీకి అనుకూలంగా ప్రచారాలతో కూడిన సందేశాలు, యూట్యూబ్ లింక్స్, పలు సర్వేల వివరాలను పంపించేవారు. అయితే ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తూ అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీ నాయకులను చేర్చడంతో పాటు వారికి అడ్మిన్ పవర్స్ కల్పించి వారి సందేశాలను గ్రూపుల్లో వైరల్ చేస్తున్న విషయాలపై ప్రతికల్లో కథనాలు రావడంతో ఎట్టకేలకు ఎన్నికల అధికారులు స్పందించారు. వీరి ఆదేశాల మేరకు ఆయా శాఖలకు సంబంధించి అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో హుటాహుటిన వైసీపీ నాయకులను అడ్మిన్లుగా తొలగించి, ఆయా గ్రూపుల్లో కేవలం అధికారులు మాత్రమే అడ్మిన్లుగా ఉండేలా మార్పులు చేశారు. అలాగే గ్రూపుల్లో సభ్యులందరు సందేశాలను తిరిగి పంపేందుకు వీలు లేకుండా కేవలం అడ్మిన్లు మాత్రమే గ్రూపుల్లో సందేశాలు పంపించేలా సెట్టింగ్స్ మార్పుచేశారు. అయితే పలు అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో మాత్రం ఇప్పటికీ కొందరు వైసీపీ నాయకులు సభ్యులుగా కొనసాగుతుండటం విమర్శలకు తావిస్తోంది.

నిబంధనలు పాటించాలని హెచ్చరికలు

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాట్సాప్ వినియోగంలో తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని జిల్లా కలెక్టర్ ద్వారా ఆయా మండలాల ఎంపీడీవోలకు, మున్సిపాలిటీల కమిషనర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీచేసి ఎన్నికల ఉల్లంఘనలు జరగకుండా చూడాలని సూచించినట్లు తెలిసింది. దీంతో వీరు తమ పరిధిలోని ఆయా సచివాలయాలు, వలంటర్లు ఇతర అధికారిక గ్రూపుల్లో హెచ్చరికలతో కూడిన ఆ సందేశాలను ఫార్వర్డ్ చేసి అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాట్సాప్ గ్రూప్ లేదా వ్యక్తిగత వాట్సాప్ ఐడీలో డీపీ ఫొటో ఏదైనా రాజకీయ నాయకుడి లేదా, ఆ పార్టీ లోగోను ఉంచరాదని సూచించారు. ఎవరైనా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఇతర అధికారులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లయితే అలాంటి సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ఎన్నికల నియామవళిని అమలు చేయండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 27: ఎన్నికల ప్రవర్తనా నియామవళిని పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఇందుకు 48 గంటలు ముందుగా సువిధా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కానీ కొన్ని అత్యవ సర పరిస్థితుల్లో రాజకీయ పార్టీలు 48 గంటల ముందు దరఖాస్తు చేసుకు నేందుకు అవకాశం లేనిపక్షంలో ఆఫ్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపుదాం

కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), మార్చి 27: ఇచ్చిన హామీలను నేరవేర్చని జగన్‌ను ఇంటికి సాగనంపుదామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. గురువారం నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీల్లో 85 శాతం ఎగోట్టినందుకు రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని ఓడించాలన్నారు. చంద్రబాబు పాలనలో 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వగా దానిని జగన్‌రెడ్డి రూ.9లక్షలకు కుదించారన్నారు. రైతు భరోసా రూ.13,500 ఇస్తానని రూ. 7,500 కుదించారని, కౌలురైతులందరికీ వడ్డీలేని రుణాలు అని చెప్పి మాట తప్పారని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి ముఠా రూ.8లక్షల కోట్లు దోపిడీ చేసిందని మండిపడ్డారు. కర్నూలుకు హైకోర్టు తెస్తానని జగన్ మాట మార్చారని, ఇచ్చిన హామీని విస్మరించి బస్సు యాత్ర పేరుతో మన జిల్లాకు వస్తున్న జగన్‌ను నిలదీయండి, గతంలో ఇచ్చిన హామీలన్ని విస్మరించినందుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

జగన్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు

కల్లూరు, మార్చి 27: రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి విస్మరించిన సీఎం జగన్‌రెడ్డికి ఓట్లు అడిగే హక్కు లేదని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం మాధవనగర్‌లోని తమ స్వగృహంలో చేపట్టిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి 99శాతం హామీలు నెరవేర్చానని గొప్పలు చెప్పడం సిగ్గుచేటన్నారు. అబద్ధపు హామీలిచ్చి నంద్యాల జిల్లా పర్యటనకు ఏమోహం పెట్టుకుని ఓట్లడగటానికి వస్తున్నావని గౌరు చరిత ఆరోపించారు. 25మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని అబద్ధం చెప్పారని విమర్శించారు. సంపూర్ణ మద్య నిషేధం చేస్తానని, పన్నులు, చార్జీలు పెంచనని ఎడాపెడా ప్రజలపై ఆర్థిక భారం వేశారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తానని మాట తప్పారని అన్నారు. కార్యక్రమంలో విశ్వేశ్వర్‌రెడ్డి, పాణ్యం తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్‌గౌడ్, రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ శ్రీరాములు, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: దస్తగిరి



దిన్నెదేవరపాడులో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), మార్చి 27: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు గ్రామంలో టీడీపీ ప్రచారంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై బుధవారం దస్తగిరి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ విధ్వంస పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు బొగ్గుల దస్తగిరికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచు ఎం.మాధవస్వామి, స్థానిక టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, పెరుగు పురుషోత్తంరెడ్డి, ఓబుల్ రెడ్డి, గిరిష్‌రెడ్డి, అనుష్‌రెడ్డి, చిత్రసేనుడు, మధుసూదన్, మహేష్, మహేంద్ర, నడిపి బాలన్న, సుబ్బయ్య, చిన్నవెంకటయ్య, మహేష్‌కుమార్, లక్ష్మన్న, జనసేన నాయకులు మధు, చిన్న, నాగన్న, మనోహర్, స్వాములు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల పరిశీలన

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 27: కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్లను బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, డీఆర్వో కే.మధుసూదన్‌రావులతో కలిసి పరిశీ లించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సం ఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్లను, స్ట్రాంగ్ రూంలను ప్రతి మూడు నెలలకు ఒకసారి పరిశీలిస్తామన్నారు. మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మే 1న ఈవీఎంల ర్యాం డమైజేషన్ జరిగి అదేరోజు జిల్లాలోని 8 నియోజకవర్గాలకు ఈవీఎం లను పోలీసు బందోబస్తు మధ్య పంపుతామన్నారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మురళి, వైసీపీ ప్రతినిధి కె.పుల్లారెడ్డి, టీడీపీ ప్రతినిధి ఎల్‌వీ ప్రసాద్, బీజేపీ ప్రతినిధి సాయి ప్రదీప్, సీపీఐ కేవీ నారాయణ, కాంగ్రెస్ ప్రతినిధి జాన్‌విల్సన్, బీఎస్పీ ప్రతినిధి అరుణ్‌కుమార్, ఆప్ పార్టీ ప్రతినిధి మహ్మద్ అలీ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి

కర్నూలు(రూరల్), మార్చి27: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని కర్నూలు రూరల్ ఎంపీడీవో నరసింహనాయుడు బుధవారం తెలిపారు. గ్రామాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేయదలచుకుంటే నియోజకవర్గ ఎన్నికల అధికారి అనుమతి పొందాలన్నారు. అభ్యర్థి ప్రచారం వెంట కేవలం మూడు వాహనాలు మాత్రమే ఉండాలని, మైక్ సెట్‌కు, ప్రచార రథానికి అనుమతి తీసుకోవాలన్నారు. రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు అభ్యర్థి ఎలాంటి ప్రచారం చేయరాదన్నారు. గోడలపైన పోస్టర్లు, ఆటోలు, కార్లు తదితర వాహనాలకు స్టిక్కర్లు వేసుకోవాలన్న రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

మట్టి తరలింపును ఆపండి

కల్లూరు, మార్చి 27: కల్లూరు మండలం ఉలిందకొండ చెరువులో అక్రమ మట్టి తరలింపును ఆపాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు జలమండలి ఎస్‌ఈ రెడ్డి శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇరిగేషన్ డీఈ, ఏఈలు మట్టి తరలింపుపై ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మధు, రైతులు రాజు, సూరి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ కూటమి గెలిస్తేనే భవిష్యత్తు

20, 21వ వార్డు శంఖారావంలో గౌరు చరిత

కల్లూరు, మార్చి 27: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలిస్తేనే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. బుధవారం 20వ వార్డు సిండికేట్ బ్యాంక్‌కాలనీ, 21వ వార్డు పరిధిలోని శివాజీ నగర్, మాధవనగర్‌లో ఆమె ప్రజల సమస్యలను తెలుసుకుని శంఖారావం, సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి టీడీపీని గెలిపించాలని గౌరు దంపతులు పిలుపునిచ్చారు. కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, వార్డు ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, జనసేన నాయకుడు ప్రవీణ్, పల్లె రఘునాథ్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, మాండ్ర నరేంద్రారెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ న్యాయవాది నాగముని, రాయలసీమ విద్యార్థి విభాగం జేఏసీ చైర్మన్ శ్రీరాములు, అయ్యస్వామి, జగదీష్, జనసేన నాయకులు ప్రణీత్ రెడ్డి పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తున్న గౌరు చరిత

● **చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: గౌరు జనార్దన్‌రెడ్డి**

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం 31వ వార్డు షరీన్‌నగర్‌లో ఇంటింటికీ తిరిగి టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి శైలజాయాదవ్, గోపి, లోకేష్, పురుషోత్తంరెడ్డి, ఎరుకలి వెంకటేశ్వర్లు, ఏసు, ఆదం పాల్గొన్నారు.

ఉర్దూ యూనివర్సిటీని గాలికొదిలేసిన ప్రభుత్వం

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మార్చి 27: ఉర్దూ యూనివర్సిటీని వైసీపీ ప్రభుత్వం గాలికొది లేసిందని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని ఓర్వకల్లు గ్రామ సమీపంలోని డా.అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని రాజశేఖర్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ ఉర్దూ వర్సిటీని పశువుల కోసం పెట్టిన యూనివర్సిటీగా వైసీపీ తయారు చేసిందని ఆరోపిం చారు. నాటి సీఎం చంద్రబాబు హయాంలో 144 ఎకరాల్లో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ అందుకోసం మొదటి విడత కింద రూ.18 కోట్లు విడుదల చేశారన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఉర్దూ యూనివర్సిటీకి ఒక్క ఇటుక కూడా వేయలేదని, మధ్యలోనే పనులు నిలిచిపోయాయన్నారు. దాదాపు నాలుగున్నర సంవత్సరాల నుంచి ఈ యూనివర్సిటీని పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ముస్లింలకు టీడీపీ హయాంలో జరిగిన మేలు ఈ వైసీపీలో జరగలేదన్నారు. టీడీపీ హయాంలో పేద ముస్లిం పిల్లల పెళ్లిళ్ల కోసం షాదీతోఫా పేరుతో రూ.లక్ష, ముస్లిం యువత ఉపాధి కోసం రూ.3 లక్షలు ఇవ్వడమే కాకుండా అందులో రూ.లక్ష సబ్సిడీ ఇచ్చారని అన్నారు. చంద్రబాబు హయాంలో ఓర్వకల్లులో విమానాశ్రయం, ఉక్కు పరిశ్రమ, ఆయుధాల పరి శ్రమ, సోలార్ వంటి పరిశ్రమలు తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు కల్పించార న్నారు. ఎన్నికల ముందు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏమి అభివృద్ధి చేశారని సీఎం జగన్ పర్యటిస్తున్నారని, ఆయనకు పర్యటించే అర్హత లేదన్నారు. కార్యక్ర మంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు మహబూబ్‌బాషా, సుధాకర్, వడ్డే నారాయణ, రామగోవిందు, అన్వర్‌బాషా, కేవీ మధు, బజారు, జయక్రిష్ణ, కాటిసేని నారాయణ పాల్గొన్నారు.



ఉర్దూ యూనివర్సిటీని పరిశీలిస్తున్న మల్లెల రాజశేఖర్

వైసీపీ అభ్యర్థిని బలి చేస్తున్నారు

కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 27: రానున్న ఎన్నికల్లో తనపై బరిలో నిలుస్తున్న వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్‌ను అనవసరంగా బలి చేస్తున్నారని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని కొత్తపేట అల్మాస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ముస్లింలకు వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. చంద్రబాబు కర్నూలు జిల్లాకు ఉర్దూ యూనివర్సిటీని ప్రకటించి పనులు ప్రారంభించినా.. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం దానిని ముందుకు తీసుకెళ్లలేదని మండిపడ్డారు. ముస్లిం కోసం గత టీడీపీ ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫాను ఇప్పుడు ఇవ్వడం లేదని, దుల్హాన్ పథకానికి నిబంధనలు పెట్టి ముస్లింలకు అందకుండా చేసిందని అన్నారు. కర్నూలులో కేవలం కుల, మత రాజకీయాలు చేయాలనే ఉద్దేశంతోనే డాక్టర్ ఇస్మాయిల్ అల్లుడైన రిటైర్డ్ ఐఏఎస్ ఇంతియాజ్‌ను బరిలో నిలిపారన్నారు. తన తండ్రి టీజీ వెంకటేష్‌కు డాక్టర్ ఇస్మాయిల్‌కు ఎంతో మంచి అనుబంధం ఉందని, వీరిద్దరిని రామ్, రహీమ్ అని కర్నూలు ప్రజలు పిలిచే వారని గుర్తు చేశారు. అంతక ముందు టీజీ భరత్ అల్మాస్ మసీదులో ముస్లింలతో రోజా ఉపవాసాలు విరమింప చేసి పండ్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో జావీద్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్కీటూ గోపి, రెహమాన్, ఇంతియాజ్, మాజార్, ఇమ్రాన్, నాసిర్, హరి, మాబాషా, మయుమ్ పాల్గొన్నారు.

రోజు విడిచి రోజు తాగు నీరు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 27: వేసవివి దృష్టిలో ఉంచుకుని నగరంలోని 52 వార్డులకు ఏప్రిల్ నెల మొదటి వారం నుంచి రోజు విడిచి రోజు ఒకసారి మాత్రమే తాగునీరు విడుదల చేసేందుకు చర్యలు తీసుకున్నామని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం అతి తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల కర్నూలు జిల్లాకు నీరు అందించే సుంకేసుల రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అడుగంటి పోవడం తోపాటు గాజులదిన్నె జలాశయం నుంచి తాగునీటిని కేబీసీ కెనాల్ ద్వారా తీసుకోవడం వల్ల ప్రతిరోజుకు సరిపడా నీరు అందడం లేదన్నారు. నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

కర్నూలు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోడుమూరు రోడ్డులో ఉన్న సోనాలిక ట్రాక్టర్ షోరూమ్ పక్కన కర్నూలు టీడీపీ పార్లమెంటు అభ్యర్థి బస్తిపాటి నాగరాజు బుధవారం ఉదయం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు టీడీపీ పార్లమెంటు అభ్యర్థిగా టీడీపీ తనకు అవకాశం ఇచ్చిందన్నారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ అభ్యర్థి నాగరాజుకు పూలమాలలు, పూలబొకేలు ఇచ్చి అభినందించారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 27: నగర సమీపంలోని బి.తాండ్రపాడు వద్ద ఉన్న ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న డిప్లమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌కు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ (2024-25, 2025-26, 2026-27) ఇలా 3 సంవత్సరాలకు గుర్తింపు వచ్చినట్లు ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి తెలిపారు. కళాశాలలోని ఆధునిక ల్యాబ్‌లు, అర్హతగల అధ్యాపకులు, క్యాంపస్ ఇంటర్వ్యూలో విద్యార్థులకు ఉద్యోగాలు తదితర అంశాలను గుర్తించిన ఎన్‌బీఏ నుంచి కళాశాలకు గుర్తింపు వచ్చిందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి 2027 వరకు కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం పది పరీక్షలు రాసే విద్యార్థులు 2024 పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసి తమ కళాశాలలో చేరే అవకాశం ఉందన్నారు. ఎన్‌బీఏ గుర్తింపు పొందడానికి కృషి చేసిన అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారులు అవకాశాలను వినియోగించుకోవాలి

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 27: క్రీడాకారులు అందివచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలని సెట్కూరు సీఈవో పీవీ రమణ అన్నారు. బుధవారం జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేసన్ ఆధ్వర్యంలో స్థానిక డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల మోడ్రన్ పెంటాతలన్ ఎంపిక పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్యతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారుడు వెంకటేశ్ మోడరన్ పెంటాతలన్ విభాగంలో పాల్గొని పతకం సాధించారన్నారు. జిల్లా తరపున ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి 31 తేదీల్లో తిరుపతిలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం మోడరన్ పెంటాతలన్ కార్యదర్శి అవినాశ్ పాల్గొన్నారు.

వైసీపీని వీడనున్న బుధవారపేట మురళీధర్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 27: వైఎస్ జగన్ యూత్‌కు రాజీనామా చేసిన జిల్లా అధ్యక్షుడు పీటీ మురళీధర్ టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. నగరంలోని బుధవారపేటకు చెందిన మురళీధర్ 16 సంవత్సరాలుగా వైసీపీకి మద్దతుగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. వైసీపీ ఆవిర్భావం ముందు నుంచే వైఎస్ జగన్ అభిమాన సంఘం నేతగా జిల్లా వాసులందరికీ సుపరిచితుడు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మురళీధర్‌నుకు గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. బుధవారపేట, కర్నూలు నగర పరిధిలోని పెద్ద ఎత్తున బంధుమిత్రులు ఉన్న మురళీధర్ తనను పార్టీ కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుందని అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీలో గుర్తింపు రాకపోవడంతో మనస్తాపానికి గురై వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 27: బీహార్‌లో ఈనెల 31వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే జాతీయ స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. సురేష్, వెంకటేశ్, భాస్కర్, అక్ష యలు ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి పి.సువర్ణ తెలిపారు. మార్చి 9, 10 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

నాటక పురోగతికి యువత కృషి చేయాలి

విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య

కర్నూలు(కల్చరల్), మార్చి 27: తెలుగు నాటక రంగ పురోభివృద్ధికి యువత కృషి చేయాలని, లేనిపక్షంలో తెలుగు పౌరాణిక, పద్య నాటకాలు తెరచాటుకు వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఉమ్మడి జిల్లా విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య అన్నారు. బుధవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'ప్రపంచ రంగస్థల దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. టీజీవీ కళాక్షేత్రం నిర్వహణలో, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బలరామయ్య విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ 18వ శతాబ్దంలోనే నాటకాలు పురుడు పోసుకున్నాయని చెప్పారు. కందుకూరి వీరేశలింగం పంతులు తొలిసారిగా నాటక ప్రదర్శనలు చేయగా, గోరా రామచంద్రరావు, బళ్లారి రాఘవ వంటి నటులు నాటకాలకు విస్తృత ప్రచారం కల్పించారని తెలిపారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ పద్య నాటకానికి సంగీత గురువు ఆద్యులని, వారు లేనిదే నాటకం రక్తికట్టదని అన్నారు. సంగీత గురువులు బండారు బలరాముడు, ఇ.పాండురంగయ్య, పీజీ వెంకటేశ్వర్లు, జేఎంజే రాజు, ధనుంజయ, శ్రీనివాసులు, కేశవులను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ రంగస్థల కళాకారులు గుర్రపుశాల అంకయ్య, వీవీ రమణారెడ్డి, మహ్మద్ మియా, ఇనాయతుల్లా తదితరులు ప్రసంగించారు.



సంగీత గురువులను సత్కరిస్తున్న గుమ్మళ్ల బలరామయ్య, పత్తి ఓబులయ్య తదితరులు

నేటి నుంచి ఖాజాహుశేన్ దాస్ స్వామి ఉరుసు

కోడుమూరు(రూరల్), మార్చి 27: మండలంలోని వర్కూరులో సద్గురు ఖాజాహుశేన్‌దాస్ స్వామి ఉరుసు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవు తాయని దర్గా పీఠాధిపతి ఖాజాసుబహాన్ హుశేన్‌దాస్ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ గురువారం అర్ధరాత్రి గంధం వేడుకలకు ముఖ్య అతిథులుగా అయ్యకొండ పీఠాధిపతులు సయ్యద్ మహబూబ్ బాషా స్వామి, సయ్యద్ అజ్గర్ హుశేన్ స్వామి హాజరు కానున్నారని తెలిపారు. శుక్రవా రం ఉరుసు, శనివారం సాయంత్రం జియారత్ కిస్తీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు రోజులపాటు దర్గాలో ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ఖవ్వాలీలు, భజనలు ఉంటాయన్నారు.

ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలి

కల్లూరు, మార్చి 27: ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లు తమ ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని పాణ్యం రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డిమౌర్య ఆదేశించారు. బుధవా రం కల్లూరు మండలంలోని బస్తిపాడు, చిన్నటేకూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోని వసతులను జేసీ పరిశీలించారు. ఈసందర్భంగా జేసీ నారపురెడ్డి మౌర్య మాటాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కల్లూరు తహసీల్దారు, ఎంఈఓ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

కర్నూలు, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో జోహరాపురం, ఇందిరమ్మ కాలనీల్లో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పవన్ కుమార్ హెచ్చరించారు.

రవీంద్ర కళాశాలలో ప్రిలిమినరీ రౌండు ప్రారంభం

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 27: వికసిత్ భారత్-2047ను పురస్కరించుకుని స్థానిక వెంకాయపల్లె సమీపంలో ఉన్న రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ ప్రాజెక్టు కాంపిటీషన్ యొక్క ప్రిలిమినరీ రౌండు-ఏసిస్ట్ 12-2024 ను బుధవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా వర్కింగ్ మోడల్ ప్రెసెం టేషన్, విమెన్ ఇన్ ఇంజనీరింగ్, జూనియర్ ఐన్‌స్టీన్ పోటీలను నిర్వహించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువు, మార్కులు మాత్రమే ఉంటే సరిపోదని, వృత్తి నైపుణ్యాలు, సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలు పెంచుకుంటేనే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కాంపిటిషన్‌లో పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

48వ వార్డులో టీజీ భరత్ భరోసా యాత్ర



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 27: నగరంలోని 48వ వార్డు రోజా ప్రాంతంలో గురువారం కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. ఆయన వెంట ఎంపీ అభ్యర్థి నాగరాజు ఉన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు. టీడీపీ సీనియర్ నాయకులు మన్సూర్ అలీఖాన్, కార్పొరేటర్ కురువ పరమేష్, భాస్కర్, సౌభాగ్యమ్మ, రఫీక్ పాల్గొన్నారు.

అత్యాధునిక టెక్నాలజీతో బీఎస్ఎన్ఎల్ సేవలు



మాట్లాడుతున్న జీఎం రమేష్‌కుబార్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 27: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సంస్థ అత్యాధునిక టెక్నాలజీ, అతి తక్కువ ధరలతో వినియోగదారులకు సేవలు అందిస్తుందని సంస్థ కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి.రమేష్ తెలిపారు. బుధవారం ప్రకాష్‌నగర్‌లోని కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాపర్ ద్వారా అందిస్తున్న ల్యాండ్ లైన్ వాయిస్, ఇంటర్నెట్ సేవలను పూర్తిగా ఫైబర్లోకి మార్చామన్నారు. బీఎస్ఎన్ఎల్ వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించిందన్నారు. ఎఫ్‌టీటీహెచ్, మొబైల్ సేవలకు సరికొత్త సెల్ఫ్ కేర్ యాప్‌ను రూపొందించామన్నారు. త్వరలో సంస్థ 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని, పాత సిమ్‌కార్డులను 4జీలోకి మార్చుకోవాలని అన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ సాయినాథ్, ఐఎఫ్ఏ శ్రీలత, ఏజీఎంలు వెంకటరాములు, శ్రీనునాయక్, వి.జాన్సన్, మురళీ కృష్ణ పాల్గొన్నారు.

సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 27: ఏపీలో రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కొత్తబస్టాండు సమీపంలోని కేకే భవన్ ఆవరణలో నిర్మించిన చిట్యాల ఐలమ్మ రజక కార్యాలయ నూతన భవనాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్ నిధులను వెనుకబడిన తరగతుల అభివృద్ధికి మాత్రమే వినియోగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దోబీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్, ఐలు జిల్లా కార్యదర్శి లక్ష్మన్న, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకుడు జి.రామక్రిష్ణ, నగర కార్యదర్శి శేషాద్రి పాల్గొన్నారు.

కల్లూరులో వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన బొల్లవరం వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన వారితో గౌరు చరిత

కల్లూరు, మార్చి 27: కల్లూరు మండలంలో వైసీపీకి షాక్ తగిలింది. కల్లూరు మండలం బొల్లవరం గ్రామానికి చెందిన వంద మంది వైసీపీ నాయకులు పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం తన స్వగృహంలో గౌరు దంపతులు వైసీపీ నంద్యాల జిల్లా కార్యదర్శి రాజేంద్రనాయుడుకు టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అధికార ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక వైసీపీని వీడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని నమ్మి పార్టీలో చేరామన్నారు. పార్టీలో చేరిన వారిలో షేక్షావలి, మధునాయుడు, ఆంజనేయులు, శంకర్, చందు, వెంకటేష్, నాగరాజు, మద్దిలేటి, ప్రకాష్, సురేంద్రనాయుడు, తిరుమలనాయుడు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, మస్తాన్‌నాయుడు, విజయ్, జానకిరాముడు, బోగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోని, మార్చి 27 : ఎన్నికల ప్రచారాలకు రాజకీయ పార్టీలు, నాయకులు విధిగా అనుమతులు తీసుకోవాలని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాలకు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా అనుమతులను పొందవచ్చు అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సమీక్షకు హాజరైన రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షల రూపాయలకు మించి ఖర్చు చేయరాదన్నారు. అభ్యర్థులు ప్రచార నిమిత్తం వినియోగించే బ్యానర్లు, జెండాలు, టోపీలు, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే అడ్వర్టైజ్మెంట్స్‌లకు సంబంధించిన రేట్ కార్డు కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థులు పర్మిషన్ తీసుకున్న ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. పార్టీల అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందే అనుమతులు తీసుకొని సభలు నిర్వహించుకోవాలన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ టీం తదితర టీములు నియోజకవర్గంలో పర్యవేక్షిస్తుంటారని పేర్కొన్నారు. ఈసారి నూతనంగా ఎన్నికల సంఘం ఇంటింటి ప్రచార నిమిత్తం 48 గంటల ముందు ప్రచారం చేసే ప్రాంతాలపై ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఎన్నికల సంఘం నిబంధన నియమించిందని సూచించారు. ఈ విషయంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ విషయంపై పునరాలోచన చేయాలని జిల్లా ఎన్నికల అధికారికి, ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీల ప్రతినిధుల తరపున వినతి అందజేయాలని కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నుండి వచ్చిన అడ్వర్టైజ్మెంట్స్, పెయిడ్ న్యూస్‌కు సంబంధించిన వాటిని కూడా లెక్కకట్టి అభ్యర్థుల ఖాతాలో నమోదు చేయడం జరుగుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. తహసీల్దారు హసీనా సుల్తానా, డీఎస్పీ శివనారాయణ స్వామి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ్మ, ఎలక్షన్ ఉప తహసీల్దారు రామేశ్వర రెడ్డి, ఎంపీడీవో విజయ్ శేఖర్, డిఎల్పీవో కార్యాలయపు పరిపాలన అధికారి వీరభద్రప్ప పాల్గొన్నారు

పబ్లిషర్స్ నిబంధనలు పాటించాలి

సాధారణ ఎన్నికల సందర్భంగా పాంప్లెట్స్, పోస్టర్స్ ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రచురణకర్తలు ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల అధికారి శివనారాయణ శర్మ అన్నారు. సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్, ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమించిన నిబంధన, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గంలో ప్రింటింగ్ ప్రెస్‌లు, ఫ్లెక్సీ షాపుల యజమానులందరూ ఏదైనా కరపత్రం/పోస్టర్‌ను ముద్రించేటపుడు ముఖ్యంగా సెక్షన్ 127 (ఏ) ప్రకారం డిక్లరేషన్‌ను పొందేందుకు ఖచ్చితమైన మార్గదర్శకాలను పాటించాలి. సెక్షన్ 127(ఏ)(2) ప్రకారం కమిషన్ సూచించిన ప్రొఫార్మా అపెండిక్స్-ఏ ప్రకారం డిక్లరేషన్‌పై ప్రచురణకర్త సంతకం చేయడంతో పాటు వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరు వ్యక్తులచే ధ్రువీకరించాలని పేర్కొన్నారు.

అలువాల గ్రామంలో 11 నెలల బాలుడికి డెంగీ

గోనెగండ్ల, మార్చి 27: మండల పరిధిలోని అలువాల గ్రామంలో 11 నెలల బాలుడు మోక్షిత్‌కు డెంగీ వ్యాధి సోకినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబ తెలిపారు. గ్రామంలో బుధవారం పలు వీధుల్లో మురికి కాలువలను శుభ్రం చేసి దోమల మందును పిచికారి చేశారు. ఎక్కువ రోజులు నిలువ ఉంచుకున్న నీటిని పారబోశారు. ఈ సందర్భంగా సాయిబాబ మాట్లాడుతూ మోక్షిత్ కర్నూలు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

మద్దికెర, మార్చి 27: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవలని ప్రిన్సిపాల్ కరణం సవిత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశం పొందడానికి పదో తరగతి మార్కుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం ఎంపిక జరుగుతుందన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి మే 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలను సంప్రదించాలన్నారు.

బాలికల భద్రత సామాజిక బాధ్యత

మద్దికెర, మార్చి 27: బాలికల భద్రత.. సామాజిక బాధ్యత అని పత్తికొండ అంగన్‌వాడీ సీడీపీవో సావిత్రీదేవి అన్నారు. బుధవారం మద్దికెర గ్రామంలో కస్తూర్బా పాఠశాల నుంచి బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సీడీపీవోతో పాటు కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ బాల్యవివాహాలు, లైంగిక వేధింపుల గురించి వివరించారు. వేసవి సెలవులు మొదలువుతాయని, మీరు జాగ్రత్తగా ఉండాలని, బాల్య వివాహాలు జరగడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. బాల్యవివాహాలు చేసినా, సహకరించినా, హాజరైనా శిక్షార్హులే అని పేర్కొన్నారు. బాల్యవివాహాలు చేస్తే. రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ఆడపిల్లలను చదివించాలి.. రక్షించాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రామాంజనమ్మ, రాజేశ్వరి, పద్మజ, చంద్రకళ, తదితరులు ఉన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ పనుల పరిశీలన

ఆదోని టౌన్, మార్చి 27 : పట్టణంలోని ప్రధాన రహదారిలో పాతబస్టాండ్ స్థలంలో నిర్మాణం జరుగుతున్న భారీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయితే, పట్టణానికే తలమానికంగా ఉంటుందని పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. రూ.33 కోట్లతో నిర్మిస్తున్న మూడంతస్తుల భారీ మునిసిపల్ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. మూడంతస్తులతో నిర్మిస్తున్న భారీ కాంప్లెక్స్ కావడంతో ఫౌండేషన్ డిజైన్‌లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్మాణ పనులు జరిగేలా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ రామచంద్ర రెడ్డి, ఎమ్ఈ వెంకటచలపతి, ఏఈ రాజశేఖర్ రెడ్డి, కాంట్రాక్ట్ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

అంబేడ్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 27 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14, జగ్జీవన్ రామ్ జయంతి ఏప్రిల్ 5, మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి ఏప్రిల్ 11న ప్రభుత్వమే అధికారికంగా జరపాలని అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు దేవిప్రసాద్, సాయిరాం, బాలస్వామి, గిడ్డయ్య కోరారు. గురువారం సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఘనంగా మహనీయుల జయంతిని నిర్వహిస్తున్నారన్నారు. పశ్చిమ ప్రాంతంలో ఆదోని రెవెన్యూ డివిజన్ కావడంతో ఇక్కడ కూడా ఆదేవిధంగా జరపాలని కోరారు. ఏప్రిల్ మాసంలో మహనీయుల జయంత్యుత్సవాలు అంగరంగ వైభవంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కాటి పోగురాజు, చంద్రయ్య, వీరేష్, జగన్నాథ్, మణికంఠ, హుసేనప్ప, ఆంజనేయులు, పాల్గొన్నారు.

బీజేపీలో సంబరాలు

ఆదోని, మార్చి 27 : కూటమి పొత్తులో భాగంగా కొంతకాలంగా ఉత్కంఠతను రేకెత్తించిన ఆదోని అసెంబ్లీ సీటు ఎట్టకేలకు బీజేపీకి కేటాయిస్తూ ఢిల్లీ పెద్దలు ప్రకటించడంతో బుధవారం రాత్రి బీజేపీ కార్యకర్తల్లో సంబరాలు మిన్నంటాయి. డాక్టర్ పార్థసారథిని అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలు భారీ ఎత్తున బాణసంచా కాల్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థిగా డా. పార్థసారథి గెలుపుకోసం అందరూ కృషి చేస్తామని బీజేపీ ఆదోని అసెంబ్లీ కన్వీనర్, న్యాయవాది శ్రీరాములు, కో-కన్వీనర్ నాగరాజ్ గౌడ్ అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్రకుమార్, పట్టణ అధ్యక్షుడు జిందే సాయి, పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

మద్దికెర, మార్చి 27: పెరవలి గ్రామంలోని రంగనాథ స్వామి దేవాలయంలో గురువారం తాత్కాలిక హుండీ లెక్కింపు ఉంటుందని ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ దస్తగిరిగౌడు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ హుండీ లెక్కింపులో హిందువులే పాల్గొనాలని, ఆసక్తిగల వారు దేవాలయ నిబంధనలకు లోబడి హుండీ లెక్కించాలని సూచించారు.

ఆలూరు ఉమ్మడి అభ్యర్థిగా వెంకప్పను ప్రకటించాలి

ఆలూరు, మార్చి 27 : టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్పను ప్రకటించాలని జనసేన పార్టీ జిల్లా రంజిత్, ఆలూరు మండల నాయకులు ఛత్రపతి కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గం సమస్యల పై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న విద్యావేత్త వెంకప్పకు ఆలూరు అసెంబ్లీ టిక్కెట్ కేటాయిస్తే టీడీపీ, బీజేపీ నాయకుల సహకారంతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే శ్రీదేవి నా భూమిని కబ్జా చేశారు

మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి మేనల్లుడి ఆరోపణ

కర్నూలు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆమె అనుచరుడు రఘుపతిరెడ్డిలు తన పొలాన్ని కబ్జా చేసి తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి స్వయాన మేనల్లుడు, టీడీపీ జిల్లా నాయకుడు కేఈ కుమార్ ఆరోపించారు. బుధవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లూరు మండలం పెద్దపాడు పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 93/2లో 40 సెంట్లు తాను రంగారావు అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి 2016లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తెలిపారు. ఈ పొలాన్ని పూజారి విజయలక్ష్మి అనే మహిళ 1988లో కొనుగోలు చేశారని, 1998లో ఆమె రంగారావు అనే వ్యక్తికి రిజిస్టర్ వీలునామా రాసి ఇచ్చిందని వివరించారు. 2011లో రంగారావు నుంచి ఆ పొలాన్ని తాను కొనుగోలు చేసి అగ్రిమెంట్ రాసుకున్నానని, 2016లో మొత్తం డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నానని తెలిపారు. ఆన్‌లైన్, అడంగల్, పాస్‌బుక్ రికార్డులు తన పేరిట ఉన్నాయన్నారు. ఇదే పొలం 2014లో రంగారావు తమకు విక్రయించి అగ్రిమెంటు చేయించారని మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ శమంతకమణి కోర్టును ఆశ్రయించగా.. తాను కూడా కోర్టును ఆశ్రయించానని తెలిపారు. ప్రస్తుతం ఈ భూ వివాదం కోర్టులో ఉందని చెప్పారు. ఈ పొలాన్ని మొదటగా కొనుగోలు చేసిన జయలక్ష్మి కుమారుడు పూజారి ప్రకాష్‌రావు అని, నకిలీ లీగలెయిర్ సర్టిఫికెట్లు సృష్టించి తన 40 సెంట్ల పొలాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆమె అనుచరుడైన వైసీపీ నాయకుడు రఘుపతిరెడ్డిలు వారి పేరిట పూజారి ప్రకాశ్‌రావు చేత అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అయితే.. పూజారి విజయలక్ష్మికి కొడుకులు లేరని, ఆమెకు ముగ్గురు కూతుళ్లు మాత్రమే ఉన్నారని తెలిపారు. లేని కొడుకు ఉన్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించి ఎమ్మెల్యే శ్రీదేవి, ఆమె అనుచరుడు రఘుపతిరెడ్డిలు నా పొలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని ఆక్రమించుకున్నారన్నారు. తమ కుటుంబం రాజకీయంగా శ్రీదేవికి గట్టి పోటీ ఇస్తుండడంతో జీర్ణించుకోలేక తమ అనుచరులతో కలసి ఆర్థికంగా దెబ్బతీసేందుకే ఇలా అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అధికారులు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన పూజారి ప్రకాశ్‌రావు సహా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఎమ్మెల్యే శ్రీదేవి, రఘుపతి రెడ్డి, సబ్ రిజిస్ట్రార్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీలో చేరిన క్రిష్ణగిరి వైసీపీ నాయకులు



శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

క్రిష్ణగిరి, మార్చి 27: చిట్యాల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, క్రిష్ణగిరి వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి నక్క నాగరాజు, చుంచు ఎర్రగుడి గ్రామ వైసీపీ నాయకులు తిలక్ గౌడ్ పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు సమక్షంలో బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆలంకొండ నబి సాహెబ్, కర్నూలు పార్లమెంట్ టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మాదాపురం ఎల్వీ ప్రసాద్, మండలఅధ్యక్షుడు శ్రీరాములు, బోయ బొంతిరాళ్ల మహమ్మద్ రఫీ, వీరభద్రుడు, నాగరాజు, తిలక్‌గౌడ్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: పట్టణంలో మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో వైసీపీ ఉపసర్పంచి నాయకంటి శ్వేతతో పాటు మరో 50 వైసీపీ కుటుంబాలు పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ.శ్యాంబాబు సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకొని తెలుగుదేశంపార్టీలో చేరారు. బుధవారం మండల అధ్యక్షుడు బలరాంగౌడ్ ఆధ్వర్యంలో కేఈ.శ్యాంబాబు వెల్దుర్తిలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న బస్తిపాటి నాగరాజు

దేవనకొండ ,మార్చి 27 : టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందన్నారు. వ్యవసాయ పారిశ్రామిక, సాగునీటి ప్రాజెక్టులు, ఐటీ రంగం అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబు గెలుపుతోనే సాధ్యమన్నారు. జిల్లాలోని వేదవతి , గురురాఘవేంద్ర ప్రాజెక్టులు పూర్తి కావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యకర్తలు చంద్రబాబు గెలుపు కోసం సైనికుల్లా కృషి చేయాలని కోరారు. టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ నాయకులు బడిగింజల రంగన్న, రామారామానాయుడు, మలకన్న, మల్లయ్య, ఆకుల వీరేష్, డీలర్ బండ్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు



ఎలక్షన్ కోడ్‌లో వైసీపీ రంగులతో ఉన్న టిడ్కో ఇళ్లు

ఆదోని, మార్చి 27 : ఆదోని పట్టణంలో టిట్కో ఇళ్లకు వైసీపీ రంగులు తొలగించలేదు. పేదవారికి ప్రభుత్వం ఇచ్చిన ఈ ఇళ్లకు అప్పట్లో అధికారులు, అధికార పార్టీ రంగులు అద్దారు. వీటిని లబ్ధిదారులకు అందించారు. టీడీపీ హయాంలో నిర్మాణం ప్రారంభించి ఇల్లు పూర్తయినప్పటికీ పంపిణీలో జాప్యం జరగడంతో అధికార పార్టీ నాయకులు కొంతమంది లబ్ధిదారులకు తాళాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. నిబంధన ప్రకారం ఈ రంగులు తొలగించాలని ఎన్నికలు నిబంధనలు ఉన్నప్పటికీ, అధికారులు మాత్రం ఇంతవరకు స్పందించలేదు. ఆదోని శివారున ఉన్న టిడ్కో ఇల్లు అన్ని బ్లాకులకు వైసీపీ రంగులు వేసి ఉంచారు. ఈ విషయంపై ఎన్నికల అధికారులకు కూడా టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



నాగలదిన్నెలో ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే బీవీ

నందవరం, మార్చి 27: నాగలదిన్నె గ్రామంలో మాజీ ఎంపీపీ రషీద్ తనయులు జబ్బార్, వహాబ్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. మసీదులో మత పెద్దలతో ప్రత్యేక దూవ చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశీంవలీ, మాజీ సర్పంచ్ ఈరన్న, ధర్మాపురం గోపాల్, గజేంద్రరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మండలపార్టీ కర్వీనర్ డి.వి. రాముడు, నాగరాజుగౌడు, నదీకైరవాడి వీరేష్, ఆదిశేషు, ఉరుకుందు, మునాఫ్, మాజీ సర్పంచు నాగేంద్రప్ప కుమారుడు నరసింహులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకుందాం

ఎమ్మిగనూరు, మార్చి 27: ఓటు హక్కును వినియోగించుకోవడం మన బాధ్యతని ఎంపీడీఓ కొండన్న అన్నారు. స్వీప్(సిస్టమేటిక్ ఓటర్స్ ఏడ్యుకేషన్ అండ్ ఎలక్టరల్ పార్టిసిపేషన్)లో భాగంగా బుధవారం మండల పరిధిలోని కోటేకల్ గ్రామంలో పాఠశాల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ విజయ్‌మోహన్, పంచాయతీ కార్యదర్శి సుభద్ర పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధన మహోత్సవాలు

మంత్రాలయం, మార్చి 27: వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య కర్ణాటకలోని నవబృందావనంలో వెలసిన సుధీంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నవ బృందానంలో వెలసిన సుధీంద్రతీర్థుల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అక్కడే మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేసి హారతులు ఇచ్చారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.30 లక్షలు

కౌతాళం, మార్చి 27: మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, పాలక మండలి చైర్మన్ నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో కొనసాగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కానుకలను లెక్కింపు కొనసాగగా నగదు రూపంలో రూ.30,18,175లు, బంగారము 5.8గ్రాములు, వెండి 4.1కిలోలు వచ్చినట్లు తెలిపారు.

టీడీపీ విజయానికి కృషి చేద్దాం : తిక్కారెడ్డి



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మంత్రాలయం, మార్చి 27: నియోకవర్గంలో టీడీపీ విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని, టీడీపీ అధిష్టానం నుంచి త్వరలో శుభవార్త వింటారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. బుధవారం మంత్రాలయం టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు భరద్వాజ్ శెట్టి, ఆధ్వర్యంలో కోసిగి మండలంలోని జుమాలదిన్నె, గౌడుగల్లు, వందగల్లు, నేలకోసిగి, కోల్‌మాన్‌పేట, దిద్ది, ఆర్లబండ గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కార్యకర్త వైసీపీ చేసిన మోసాలను, అన్యాయాలను, దౌర్జన్యాలు ప్రజలకు తెలిజేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డి, వక్రాణి వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

బార్ అభివృద్ధికి కృషి చేస్తాం

● ఉత్కంఠ పోరులో సుందర్ సింగ్ ప్యానల్ గెలుపు




సుందర్ సింగ్ , జనార్దన్

ఆదోని రూరల్, మార్చి 27 : ఆదోని బార్ అసోసియేషన్ అభివృద్ధి కోసం కృషి చేస్తామని నూతన కమిటీ అధ్యక్షుడు ఎల్.కె. సుందర్ సింగ్, ఉపాధ్యక్షులు ఎం.జనార్దన్ తెలిపారు. బుధవారం స్థానిక బార్‌రూంలో నూతన కమిటీకి ఎన్నికలు జరిగాయి. మొత్తం 263 ఓట్లు ఉండగా, 236మంది ఓటును వినియోగించుకున్నారు. అధ్యక్ష బరిలో ఉన్న ఎల్.కె.సుందర్ సింగ్‌కు 141, అనీతా బాయికి 95, ఉపాధ్యక్ష బరిలో ఉన్న జనార్దన్‌కు 159, తాయన్నకు 77, సెక్రటరీ బరిలో ఉన్న సురేంద్ర కుమార్‌కు 144, లోకేష్ కుమార్‌కు 92, ట్రెజరర్ బరిలో ఉన్న మహ్మద్ లతీఫ్ అహ్మద్‌కు 151, అబ్దుల్ రహీం అన్సారీకి 81 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్ జరిగింది. ఈ ఉత్కంఠ పోరులో సుందర్ సింగ్ ప్యానల్ ఘన విజయం సాధించింది. బార్ అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రతి న్యాయవాది సమస్యలను పరిష్కరించడానికి తమవంతు పాటు పడుతామని పేర్కొన్నారు. తమకు ఓటేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు



నెట్టేకల్లు గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆదోని రూరల్, మార్చి 27 : రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సిఐ నీరంజన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం కేంద్ర పోలీసు బలగాలు, ఎస్.ఐలు ఎర్రిస్వామి, శ్రీనివాసులు, పీరయ్యలతో కలిసి సిఐ నెట్టేకల్లు, సాంబగల్లు,చిన్న పెండేకల్లు గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించి ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓటు హక్కును నిర్భయంగా వేసుకోవాలని, ఓటర్లను ఇబ్బందులకు గురి చేస్తేమాత్రం సహించబోమని హెచ్చరించారు. గ్రామాల్లో ఉన్న సస్పెక్టెడ్, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి వీరి కదలికలపై ఆరా తీస్తున్నామన్నారు.

వందే భారత్ స్టాపింగ్ కోసం వినతి

ఆదోని టౌన్, మార్చి 27 : కల్బురిగి నుండి బెంగళూరు వరకు నడిచే వందేభారత్ రైలుకు ఆదోని స్టేషన్‌లో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, రెండు లక్షల పైచిలుకు జనాభా ఉన్న ఆదోని పట్టణ ప్రజలతో పాటు, డివిజన్‌లోని ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల ప్రజలు నిత్యం వివిధ అవసరాల నిమిత్తం ఆదోని స్టేషన్ నుండే బెంగుళూరుకు రాకపోకలను సాగిస్తుంటారని పేర్కొన్నారు. ఆదోని స్టేషన్‌లో స్టాపింగ్ ఏర్పాటు చేస్తే ఎంతో మంది ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని రైల్వే మంత్రికు లేఖ రాసినట్లు తెలిపారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి



మాట్లాడుతున్న మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

పెద్దకడుబూరు, మార్చి 27: బీసీ వర్గాల అభివృద్ధి బీసీ నాయకుడితో సాధ్యమని నమ్మి అసెంబ్లీ సీటు కేటాయించిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందని మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. పెద్దకడబూరులోని టీడీపీ అభ్యర్థి పరిచయ వేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలందరూ తోడుగా నిలిచి తన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నెమలికల్లు గ్రామానికి చెందిన 10 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, టీడీపీ తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు శశిరేఖ తదితరులు పాల్గొన్నారు. అలాగే మంత్రాలయంలో కార్యకర్తలతో కలిసి తిక్కారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గోనెగండ్ల, మార్చి 27: వేముగోడు గ్రామంలో మంగళవారం రాత్రి అర్జునుడు(43) అనే రైతు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. అర్జునుడికి భార్య పద్మావతి, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. రెండు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మూడేళ్లుగా పలు రకాల పంటలు సాగు చేసినప్పటికి పంటలు సక్రమంగా పండలేదు. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా చెతికి అందలేదు. ఈ ఏడాది పత్తి, వేరుశనగ పంటలను సాగు చేశాడు. పంటలు దిగుబడి రాలేదు. గతంలో చేసిన అప్పు ప్రస్తుతం చేసిన అప్పులు మొత్తం కలిపి రూ. 5లక్షలకు చేరింది. అప్పులు ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో అప్పులు ఎలా తీర్చాలి అని మానసిక క్షోభకు గురై మంగళవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోని ఇనుప కొక్కికి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సకు తీసుకువెళ్లెందుకు ప్రయత్నించారు. అప్పటికే మృతి చెందినట్లు తెలుసుకున్నారు. భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.